

హైదరాబాద్ వార్త


# తెరవెనుక రాజకీయం

ఓవైపు ప్రచారాలు.. మరోవైపు మంతనాలు

బిజీబిజీగా ఎమ్మెల్యే అభ్యర్థులు, ఆశావహులు

ప్రత్యర్థుల బలాలు, బలహీనతలపై ఆరా

సమాచార సేకరణకు ప్రత్యేక టీమ్‌లు

అసంతృప్తులతో రహస్య సమావేశాలు

గ్రేటర్‌లో జోరందుకున్న రాజకీయం

**ఆశావహుల ఎదతెరిపిలేని మంతనాలు**



హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త: ఎన్నికల నోటిఫికేషన్‌కు గడవు సమీపిస్తుంటంతో వివిధ పార్టీల అభ్యర్థులు, ఆశావహులు ఎడతెరిపి లేకుండా మంతనాలు జరుపుతున్నారు. ఇప్పటికే టిఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్, బిజెపిల్లో సంకేతాలు అందినవారు తదుపరి ఏంచేయాలనే అంశాలపై చర్చలు జరుపుతున్నారు. గెలుపుకోసం అందివచ్చే ఏఅవకాశాన్ని కూడా వదులుకోకుండా సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యర్థుల బలాబలాలు, వ్యతిరేఖక అంశాలపై ఆరా తీస్తున్నారు. నాయకులు కార్యకర్తలతో నిఘా ఏర్పాటు చేసి అసంతృప్తులు,అసమ్మతి వాదులను ఆకట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. వారిని ఎలా తమవైపు తిప్పుకోవాలా అని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.ఈక్రమంలోనే గ్రేటర్‌లోని వివిధ స్థానాల్లో పలు పార్టీల నుండి టికెట్ ఖరారైన అభ్యర్థులు,తమకే వస్తుందన్న ఆశతోఉన్నవారు క్షణం తీరికలేకుండా గడుపుతున్నారు.ఎన్నికల రణరంగంలో ఎలాగైనా గెలిచితీరాలని ప్రత్యర్థిని మట్టికరిపిం చేందుకు చాణక్య వ్యూహాలను రూపొందిస్తున్నారు. టికెట్లు ఖరారులో కాస్తంతా వెనకబడినా గెలుపు కసరత్తు మొదలు పెట్టారు. ముఖ్యంగా టిఆర్ఎస్ అభ్యరు ్థల ప్రకటన ముందుగానే వెలువడటంతో ప్రత్యర్థి ఎవరనే అంశంపై వారు సుమాలోచనలు ప్రారంభించారు. గ్రేటర్‌లోని 24 నియోజకవర్గాల్లో గోషామహాల్, మల్కాజ్‌గిరి, నాంపల్లి కాకుండా మిగతా స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించిన టిఆర్ఎస్ ప్రచారంలో దూసుకుపోతుంది. కాంగ్రెస్ తయారు చేసిన మొదటి విడత జాబితాలో కొంతమంది ముఖ్యనేతలకు టికెట్ ఖరారైనట్లు సమాచారం అందడంతో వారు ఎన్నికల ప్రచారానికి సమాయత్తం అవుతున్నారు. అయితే పార్టీల అధిష్టానాల వ్యూహాలు ఎలా ఉన్నప్పటికీ స్థానిక నియోజకవర్గాల్లో పోటీచేసే అభ్యర్థులు మాత్రం తమ గెలుపుపైనే ప్రధాన దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఎదుటి పార్టీల అభ ్యర్థుల బలాబలాలు,బలహీనతలు వారిపై స్థానికంగా ఉన్న అసంతృప్తితోపాటు వారికి వ్యతిరేఖంగా పనిచేసే నాయకులు తదితర అంశాలపై తమకు నమ్మకంగా ఉండే వ్యక్తులతో సమాచారం సేకరిస్తున్నారు. దీంట్లో భాగంగా తాము ఎవరితో సంప్రదింపులు జరిపితే ప్రత్యర్థికి వ్యతిరేఖంగా ఉన్న ఓట్లు తమకు అనుకూలంగా మారుతాయనే కోణంలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థులు నమ్మిన వ్యక్తులతో పాటు ఇతర అభ్యర్థులకు వ్యతిరేఖంగా పనిచేసే వారితో నిత్యం రహస్య మంతనాలు జరుపుతున్నారు.దీంతో గ్రేటర్ రాజకీయం మరింత రంజుగా మారింది.

### స్కూటీపై వెళుతున్న భార్యను వెంబడించి..

## బండరాయితో మోది హత్య చేసిన భర్త

వనస్థలిపురం, అక్టోబరు 7 ప్రభాతవార్త: కుటుంబ కలహాలతో స్కూటిపై వెళుతున్న భార్యను భర్త వెంబడించి బండరాయితో తలపై మోది హత్య చేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా కొనిజేడు గ్రామానికి చెందిన తన్నీరు షాలిని (32)ను అదే జిల్లాకు చెందిన సంతనూతలపాడు గ్రామానికి చెందిన బాలకోటయ్య (43)తో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. గత కొన్ని సంవత్సరాల క్రితం బాలకోటయ్య దంపతులు నగరానికి వచ్చి వనస్థలిపురంలో నివాసముంటున్నారు. బిల్డర్ వృతిలోఓ ఉన్న బాలకోటయ్యకు ఇద్దరు కుమారులు, 6 నెలల క్రితం మునగనూరులో స్వంత ఇల్లు నిర్మించుకుని బాలకోటయ్య దంపతులు నివాసముంటున్నారు. కాగా కొంతకాలంగా భార్యభర్తలమధ్య గొడవులు జరుగుతున్నాయి. ఇద్దరి మధ్య గొడవలు తీవ్రమవడంతో బాలకోటయ్య స్వంత ఊరికి వెళ్లాడు. శుక్రవారం ఊరునుండి తిరిగి వచ్చిన బాలకోటయ్య షాలినికోసం ఎదురు చూస్తున్నాడు. షాలిని మునగనూరునుండి స్కూటిపై శుక్రవారం రాత్రి తల్లిదండ్రులు నివాసముంటున్న విజయపురి కాలనీ ఫేజ్1కు వెళుతుంది అది గమనించిన బాలకోటయ్య స్కూటీపై వెళుతున్న భార్యను వెంబడించి దారిలో అడ్డగించి గొడవకు దిగాడు. స్కూటీపైనుండి షాలినిని నెట్టివేయడంతో ఆమె కింద పడింది. వెంటనే కోటయ్య బండరాయితో ఆమె తలపై మోదడంతో షాలిని మృతి చెందింది. అనంతరం బాలకోటయ్య అక్కడినుండి పరారయ్యాడు.సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### కుటుంబ కలహాలతో బావ మరిదిపై కత్తితో దాడి

చార్మినార్,అక్టోబరు 7 ప్రభాతవార్త : కుటుంబ కలహాలతో బావ తన సొంత బావ మరిదిపై కత్తితో దాడి చేసి గాయ పరిచిన సంఘటన పాతబస్తీ హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది.హుస్సేనీఆలం పోలీసులు కథనం ప్రకారం.. పాతబస్తీ భవానీనగర్‌కు చెందిన రషీద్ (40) కాంట్రాక్టర్.కాగా రషీద్ సోదరితో నవాబ్ సాహెబ్‌కుంటకు చెందిన ఖలీల్ వివాహం జరిగింది.భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.కొద్ది రోజుల క్రితం రషీద్ ఇంటికి ఖలీల్‌ను పిలిపించి నచ్చజెప్పారు. కాగా శనివారం మధ్యాహ్నం రషీద్ కిల్వత్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుచున్న తన పిల్లల స్కూల్ ఫీజులు కట్టిన అనంతరం వాహనంపై అబిడ్స్ వెళుతున్నాడు. కిల్వత్ రహదారిలో ఖలీల్ కత్తితో రషీద్ భుజంపై దాడి జరిపాడు.ఈ సంఘటనలో గాయాల పాలైన రషీద్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఈ కేసును హుస్సేనీ ఆలం పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## కెపిహెచ్‌బిలోని ఫర్నీచర్ షాప్‌లో భారీ అగ్ని ప్రమాదం



దగ్ధమవుతున్న ఫర్నీచర్ షాపు

మూసాపేట, అక్టోబర్ 7, ప్రభాతవార్త : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఫర్నిచర్ షాపులో మంటలు చెలరేగి ఆస్తి నష్టం అయిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కెపిహెచ్‌బి మెట్రో స్టేషన్ సర్వీస్ రోడ్డులోని ఎమ్మెస్ ఫర్నిచర్ షోరూంలో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఫర్నిచర్ షోరూంపైన రెండంతస్తుల్లోని షాపులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోని చెప్పుల దుకాణానికి కూడా మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా జరిగిన సంఘటనతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న 4ఫైర్ ఇంజన్లు సకాలంలో చేరుకొని మంటలను అదుపులోకి తీసుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి ప్రాణ నష్టం లేకపోయినా భారీగా ఆస్తినష్టం జరిగి ఉండోచ్చని పోలీసలు భావిస్తున్నారు.

### ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న భరత్‌సింహారెడ్డి

పేట్‌బషీరాబాద్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: అనుమానాస్పద స్థితిలో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌కు చెందిన దుర్గారెడ్డి కుమారుడు భరత్‌సింహారెడ్డి(20) మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటి క్యాంపస్‌లో ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తూ సమీపంలోని మహేశ్వరి హాస్టల్‌లో ఉంటున్నాడు. శనివారం భరత్‌సింహారెడ్డి కళాశాలకు వెళ్ళకుండా హాస్టల్లోని తన గదిలోనే ఉన్నాడు. సహ విద్యార్థులు సాయంత్రం 4:30గంల సమయంలో వచ్చి తలుపులు తట్టగా తీయకపోవడంతో లోపల చూడగా భరత్‌సింహారెడ్డి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దింపి పోస్టుమార్టం కోసం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తెలంగాణ సమావేశం





సమావేశంలో పాల్గొన్న ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు

చార్మినార్, అక్టోబరు 7 ప్రభాతవార్త : పాతబస్తీ బహదూర్‌పుర కార్యాలయంలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మహ్మద్ షకీల్ మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని జిల్లాలలో పార్టీని బలోపేతం చేయాలని నిర్ ్ణయించామని,అదే విధంగా మైనార్ ్టల అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.తాత్కాలిక ప్రధాన కార్యదర్శి షేక్ ముజాహిద్,ఉపాధ్యక్షులు అహ్మద్ అల్ కసేరి,హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్ మాలిక్‌తో పాటు పలుజిల్లాలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఎన్నికల కోడ్‌కు ముందే

## స్పౌజ్ బదలీలు చేపట్టాలి



స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేనకు వినతి పత్రాన్ని అందజేస్తున్న స్పౌజ్ ఫోరం ప్రతినిధులు

సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కంటే ముందే ప్రభుత్వం స్పౌజ్ బదిలీలను చేపట్టాలని స్పౌజ్ ఫోరం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం ఫోరం ప్రతినిధి బృందం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వినతి పత్రాలను సమర్పించాయి. ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధులు రాజేశ్వరి, ప్రీతి, సరస్వతి, వివేక్, నరేష్, కృష్ణ తదితరులు మాట్లాడుతూ ప్రస్తుతం అవకాశం ఉన్న మేరకు స్పౌజ్ బదిలీలు చేపట్టి, మిగిలినవి డిప్యూటేషన్‌పైన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌జిటి, పిఇటి, భాషా పండితులు, మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ సౌజ్ బదిలీలను చేపట్టాలని మహిళా ఉపాధ్యాయుల వారిని వేడుకున్నారు. గత జనవరిలో ప్రభుత్వం వేవలం 615 స్కూల్ అసిస్టెంట్ స్పౌజ్ బదిలీలను మాత్రం మాత్రమే జరిపిందని, ఇంకా మిగిలిన 1500 ఎస్‌జిటి, భాషా పండితులు, పిఈటిల స్పౌజ్ బదిలీలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మేజారిటి బాధితులు మహిళా ఉపాధ్యాయులేనని వారు ప్రతిరోజు కుటుంబాన్ని వదిలిపెట్టి వందల కిలోమీటర్ల ప్రయాణం చేస్తూ తీవ్ర మానసిక, శారీరక ఆందోళన చెందుతున్నారని వారు తెలిపారు.

## మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఎన్నికల్లో అనర్హుడుగా ప్రకటించాలి

**బిఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్**

**కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు**

నాంపల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త : రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే గడువులోగా ప్రభుత్వ పథకాలన్నింటికీ లబ్ధిదారులుగా బిఆర్ఎస్ పార్టీకి ఓట్లువేసే వారిని ఎంపిక చేయాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు టెలికాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్లకు మౌకిక ఆదేశాలు ఇవ్వడం అధికార దుర్వినియోగానికి పాల్పడడమేనని బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేస్తూ ఈ మేరకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేస్తూ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుండి లేఖ విడుదలచేసి ఎర్రబెల్లి వ్యాఖ్యల వెనుక ముఖ్యమంత్రి కెసిఆర్ హస్తం ఉన్నట్లు ఆయన ఆరోపించారు. దయాకర్‌రావు వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి తక్షణమే కేంద్ర ఎన్నికల సంఘం విచారణ జరిపి చర్యలు తీసుకొని వచ్చే ఎన్నికల్లో పోటీచేయకుండా అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. మంత్రి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, ఇండియన్ పీనల్‌కోడ్ 1860 ఉల్లంఘించడమే అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.బిఆర్ఎస్ పార్టీకి ఏకగ్రీవంగా మద్దతు తెలిపే గ్రామాల్లో దళితబంధు కేటాయించి అవినీతికి పాల్పడుతున్నారన్నారు. పార్టీకి మద్దతు తెలుపని ప్రజల మధ్య కుల మత విద్వేషాలు హింసలు సృష్టించేలా వివాదాస్పదంగా లబ్దిదారుల జాబితాను ఎంపికచేసి విడుదల చేయాలని ఎన్నికల్లో గెలవాలని పబ్బం గడుపుకునే ప్రయత్నాలు, ఐక్యంగా ఉన్న తెలంగాణ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న నీచపుబుద్ధి మానుకోవాలని హితవుపలికారు.

### నాల్గవ అంతస్తునుంచి పడి బాలుడు మృతి

హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త: నగరంలోని బంజారాహిల్స్ లో విషాదం చోటు చేసుకుంది. 14ఏళ్ల బాలుడు ప్రమాదవశాత్తు నాల్గొవ అంతస్తు నుంచి పడి మృతి చెందాడు. మృతుడు శ్రీనగర్ కాలనీలోని ఓప్రైవేట్ ఆపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్ కుమారుడిగా గుర్తించారు. బాలుగు నాల్గొవ అంతస్తు నుంచి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఎల్బీ స్టేడియం కుస్తీ పోటీల్లో ఘర్షణ

### కొట్టుకున్న ఇద్దరు పహిల్వాన్లు



హైదరాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త : ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో ఘర్షణ చోటు చేసుకుంది. శుక్రవారం అర్థరాత్రి ఎల్బీస్టేడియంలో జరిగిన 'మోదీ కేసరి దంగల్ కుస్తీ' పోటీల్లో ఒక్కసారిగా వివాదం చెలరేగింది. మ్యాచ్ జరుగుతుండగానే అక్కడే ఉన్న ఇద్దరు పహిల్వాన్ల మధ్య వాగ్వాదం చివరకు గొడవకు దారి తీసింది. ఒక్కసారిగా ఇద్దరు పహిల్వాన్లు, వారితో పాటు వచ్చిన ఇరువర్గాల సభ్యులు కూడా బీభత్సం సృష్టించారు. కుర్చీలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఓ వైపు పహిల్వాన్లు ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటుండగా మరోవైపు వారి పక్కన ఉన్న అనుచరులు కూడా దాడికి దిగారు. స్టేడియంలో ఉన్న కుర్చీలు అన్నీ కూడా ఒకరిపై ఒకరు విసురుకున్నారు. ఈ కుస్తీ పోటీని చూసేందుకు వచ్చిన ప్రేక్షకులు ఒక్కసారిగా వివాదం చెలరేగడంతో భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం అక్కడి సీసీటీవీల్లో రికార్డు అయ్యింది. స్థానికులు, పోటీలు నిర్వహించిన నిర్వహకులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి ఇరు వర్గాల సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. మొదట ఎవరు ఎవరికిపై దాడి చేశారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా రెండు రోజుల పాటు ఈ పోటీలు జరగాల్సి ఉండగా, నిన్నటి ఘర్షణతో అప్పటి వరకు పోటీలను తాత్కాలికంగా నిలిపివేశారు.

## అండర్-15 గోల్ఫ్ కప్ క్రికెట్ టోర్నీకి ఎంపికైన బండ్లగూడ విద్యార్థులు

**ఎంచుకున్న రంగంలో శిఖరాగ్రానికి చేరుకోవాలి : సురేష్‌గౌడ్**



దుబాయ్‌లో జరుగనున్న ఇంటర్‌నేషనల్ అండర్-15.గోల్ఫ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌కు సెలక్ట్ అయిన విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

నార్సింగి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : ఎంచుకున్న రంగంలో శిఖరాగ్రానికి చేరుకునేందుకు నిరంతరం కష్టపడాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం బండ్లగూడలోని రాఘవేంద్ర స్పోర్ట్ ఎస్టేట్ గ్రౌండ్‌లో ఈ నెల 16.నుంచి 22.వరకు జరుగనున్న అంతర్జాతీయ స్థాయి అండర్-15 గోల్ఫ్ కప్ క్రికెట్ టోర్నీకి ఎంపికైన విద్యార్థులు జశ్వంత్, శాన్వి, వేదాంత్, అపూర్వ్, రిత్విక్, విఘ్నేష్‌లను సురేష్‌గౌడ్, హెడ్ కోచ్ పి.ప్రవీత్ కుమార్(ఐసిసి లెవల్ అండ్ ఇంటర్ నేషనల్ సర్టిఫైడ్ కోచ్), రాఘవ్ గౌడ్, ప్రేమ్‌గౌడ్‌లు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆట,పాటలకు కూడా సమ ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆటలు ఆడడం వలన ఆటల్లో నైపుణ్యతను పెంచుకోవడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రస్తుతం క్రికెట్, షటిల్, బ్యాట్మెంటిన్, కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, పరుగుపందెం, ఆర్చరి క్రీడలకు మంచి డిమాండ్ ఉందని, చిన్నారులు తమకిష్టమైన క్రీడను ఎంచుకొని శిఖరాగ్రానికి చేరుకోవాలని సూచించారు.

### డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకోసం దరఖాస్తుదారుల ఆందోళన

చిక్కడపల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త: అర్హులైన లబ్దిదారులకు డబుల్‌బెడ్ ఇళ్ళను కేటాయించడం లో పూర్తిగా విఫలం అయిందని నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ ఆరోపించారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎల్లయ్య బస్తీలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలు శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న గుర్రం శంకర్ మాట్లాడుతూ బస్తీలో 24 కుటుంబాలున్నాయని, 14 మంది దరఖాస్తు చేసుకుంటే ఒక్కరికి కూడా ఇళ్ళు మంజూరు కాకపోవడం దురదృష్టకరమని, మంజూరు కాకపోవడంలో గల అంతర్యమేమిటని ప్రశ్నించారు. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళన్నీ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు, మద్దతుదారులకే కేటాయించారని, అర్హులైన పేదలకు ఇళ్ళను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ళను కేటాయించకపోతే వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ ఆందోలన కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు గుర్రం చంద్రకళ, కృష్ణయాదవ్, స్థానికులు ఉమేష్, శంకర్, చంద్రకళ, పద్మ, వెంకట్, రఘు తదితరులు పాల్గొన్నారు.

### ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ఒయూ ఆర్ట్స్‌కాలేజ్ ఎదుట

వాల్‌సోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షులు లక్ష్మిగారి ఆంజనేయులు

తార్నాక, అక్టోబర్ 7 ప్రభాతవార్త: పెరేడ్‌గ్రౌండ్‌లో జరుగనున్న ముదిరాజ్‌ల ఆత్మగౌర సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కదలిరావాలని ముదిరాజ్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు,ఒ.యూ ఉద్యమ నేత లక్ష్మిగారి ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. సభకు సంభందించి రూపొందించిన వాల్ పోస్టర్‌ను డా. లక్ష్మిగారి ఆంజనేయులు విధ్యార్థులతో కలిసి ఒ.యూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు డా. లక్ష్మిగారి ఆంజనేయులు మాట్లాడుతూ ముదిరాజ్‌లు ప్రతి ఇంటి నుంచి సభకు వచ్చి తమ సత్తాచూపించాలని కోరారు. జాతీ అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం కదలిరావాలని పిలుపు ఎనిచ్చారు. పార్టీలకు అతీతంగా ఐక్యమత్యంతో తమ డిమాండ్ల సాధనకు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భీమ్‌సేన్ ముదిరాజ్, స్వామి ముదిరాజ్, జగదీష్ ముదిరాజ్, వెంకటేష్, జానకి రామ్ ముదిరాజ్, స్వామి, బోయిన ప్రదీప్ ముదిరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి తలసాని



మోండా డివిజన్‌లోని బండి మెట్టులో రూ.20 లక్షల వ్యయంతో సివరేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట, అక్టోబర్ 7 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు వివిధ విభాగాలకు చెందిన అధికారులు అప్రమత్తంగా ఉండి వాటిని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం మోండా డివిజన్‌లోని బండి మెట్టులో రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సివరేజ్ పైప్‌లైన్ పనులను కార్పోరేటర్ కొంతం దీపిక, మాజీ కార్పోరేటర్ ఆకుల రూప హరిక్రిష్ణలతో కలిసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా తలసాని మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో శ్రీకారం చుట్టిన అభివృద్ధి పనులకు వెంటను పనులు చేపట్టాలన్నారు. అస్తవ్యస్థంగా ఉన్న స్థంబాలను తొలగించి నూతన స్థంబాలను ఏర్పాటు చేసి కేబుల్ వైర్లను ఏర్పాటు చేయాలన్నారు. సివరేజ్ పైప్‌లైన్ పనులు పూర్తైన వెంటనే రోడ్లను వేస్తామన్నారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన లక్ష్మి నర్సింహ్మా స్వామి ఆలయ అభివృద్ధికి వచ్చే ఎన్నికల తరువాత ఆలయ పునర్ నిర్మాణం పనులు చేపడుతామన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఒక్క రూపాయి ఖర్చులేకుండా ఇప్పటి వరకు 70 వేల ఇండ్లను ఇచ్చామన్నారు. మరో 30 వేల మందికి త ్వరలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఆకుల హరిక్రిష్ణ, నాగులు, బిఆర్ఎస్ నాయకులు మహేశ్ యాదవ్, పొన్నాల సాయి, డిప్యూటీ కమిషనర్ శంకర్, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్ ్స సిజిఎం ప్రభు, డిజిఎం శషాంక్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది : కలెక్టర్ అనుదీప్



మారేడ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మానసిక వికలాంగుల సెంటర్‌ను సందర్శించిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్

కంటోన్మెంట్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: మానసిక వికలాంగులను హక్కున చేర్చుకొని వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దురి శెట్టి అనుదీప్, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్‌లు తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో కొనసాగుతున్న రాజీవ్ విద్యా మిషన్, ప్రత్యేక అవసరాలు పిల్ల వనరుల కేంద్రాన్ని వారు సందర్శించిచారు. ఈ కేంద్రంలో విద్యా బోధన పొందుతున్న మానసిక వికలాంగులను బుద్ధి మాంద్యులు చేర్చుకుంటున్న విద్యా బోధనలను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రంలో వారికి కావాల్సిన అవసరాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. బుద్ధి మాంద్యులకు విద్యా బోధనలు అందిస్తున్న టీచర్లకు, విద్యార్థులకు కావాల్సిన అవసరాలను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్‌డిఓ రవి, మారేడ్‌పల్లి తహశీల్దార్ పద్మసుందరి పాల్గొన్నారు.

## విలీనంకు ముందే సమస్యలు పరిష్కరించండి

**టీఎస్ఆర్‌టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ కే.రాజిరెడ్డి**





ధర్నాలో ప్రసంగిస్తున్న టీఎస్ ఆర్‌టీసీ జేఏసీ ఛైర్మన్ కె రాజిరెడ్డి

ధర్నాచౌక్, అక్టోబర్ 7, ప్రభాతవార్త: ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి ముందే ఆర్‌టీసీలో ఉన్న సమస్యలను పరిష్క రించాలని టీఎస్ఆర్‌టీసీ జేఏసీ ఛైర్మన్ కే.రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో టీఎసఆర్‌టీసీ జేఏసీ ఆధ్వర్యంలో మా సమస్యలు పరిష్కరించండి, మా కుటుంబాలను కాపాడండి అంటూ మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి రాజిరెడ్డి మాట్లాడుతూ 2017, 2021 పే స్కేల్‌ను తక్షణమే ప్రకటించాలని, 2021 ఏప్రిల్ నుండి రావలసిన వేతన ఒప్పందంపై కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీసీఎస్‌లో ఆర్టీసీ యాజమాన్యం వాడుకున్న 1070 కోట్ల రూపాయలను తిరిగి సీసీఎస్‌కు చెల్లించాలని, పీఎఫ్ సంస్థకు ఆర్‌టీసీ చెల్లించాల్సిన డబ్బులు తక్షణమే చెల్లించి, హయ్యర్ పెన్షన్ అంశంలో కార్మికులకు నష్టం జరగకుండా చూడాలని కోరారు. ఇలాంటి సమస్యలు ఏవీ పరిష్కరించకుండా విలీనం చేస్తే ఆర్టీసీ కార్మికులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జేఏసీ కో కన్వీనర్ కే.యాదయ్య మాట్లాడుతూ విలీనం ప్రక్రియలో అనుసరించాల్సిన విధి విధానాలు రూపకల్పనలో కార్మిక సంఘాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని, వారి అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వి.ఎస్.రావు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

### శాంతి మత సామరస్యం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న రాజేంద్రనగర్ డిసిపి జగదీశ్వర్‌రెడ్డి,ఎసిపి గంగాధర్,గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త : శాంతి మత సామరస్యం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రాజేంద్రనగర్ డిసిపి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ డిసిపి కార్యాలయంలో శనివారం డిసిపి జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది.డిసిపి జగదీశ్వర్‌రెడ్డి,ఎసిపి గంగాధర్,జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ డిసి రవి కుమార్‌తో పాటు పలువురు అధికారులను రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు నారగూడెం మల్లారెడ్డి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరగటానికి సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు.పలు శాఖలకు చెందిన అధికారులు,రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉప్పల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బిఎల్ఆర్,కార్పోరేటర్ పన్నాల

### బిఆర్ఎస్ అభ్యర్థి బిఎల్ఆర్

నాచారం,అక్టోబర్ 7 ప్రభాతవార్త: ప్రజలు ఆశీర్వదించి ఓటు వేస్తే ఉప్పల్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్‌లో విఎన్ఆర్ గార్డెన్‌లో కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అధ్యక్షత బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి బిఎల్ఆర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు రెండు నెలలు కష్టపడి గెలుపుకోసం కృషి చేస్తే తాను నియోజక వర్గాన్ని 5సంవత్సరాల పాటు అభివృద్ధి చేసి చూపిస్తానని హామినిచ్చారు. ఉద్యమకారులందరికి సముచిత ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. పారిశ్రామిక వాడలల సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నివాసయోగ్య ప్రాంతాలుగా మార్చినట్లు చెప్పారు. నియోజక వర్గానికి వందపడకల ఆసుపత్రి మంజూరు చేయించానని వెల్లడించారు. కార్యకర్తలందరికి ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కల్పిస్తానని హామి నిచ్చారు. డిగ్రి, జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అశోక్‌నగర్‌లో హైటెన్షన్ వైర్ల సమస్యను, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పోరేటర్ గొల్లూర్ అంజయ్య, తండా వాసుదేవ గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుంది



వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న మంత్రి తలసాని, సినీనటులు నిఖిల్ సిద్ధార్థ్,విశ్వక్‌సేన్

### మంత్రి తలసాని

కంటోన్మెంట్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదయ్య నగర్ మున్సిపల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన తలసాని ఛాలెంజ్‌కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్స్ ముగింపు వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ప్రపంచంలోని దేశాలు క్రీడాకారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నాయన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం వారికి తగిన ప్రోత్సాహాన్ని కూడా అందించాలన్నారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో 5 టీమ్‌లు పాల్గొనగా ఆర్మీ రెడ్ టీమ్ మొదటి బహుమతి కైవసం చేసుకుంది. దక్షిణ మధ్య రైల్వే ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. అదే విధంగా బాలికల విభాగంలో 4టీమ్‌లు పాల్గొనగా ఆదయ్య నగర్ టీమ్ మొదటి బహుమతి కైవసం చేసుకుంది. స్పోర్ట్స్ అథారిటీ టీమ్ ద్వితీయ స్థానం సంపాదించుకుంది. పాల్గొన్న క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేయడంతో పాటు మెమోంటోలు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, పోలీస్ హౌజింగ్ కార్పోరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సంపద పెంచి పేదలకు పంచడమే సిఎం కేసిఆర్ లక్ష్యం

### గృహలక్ష్మీ పథకం పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే వివేకానంద్


లబ్దిదారులకు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గండిమైసమ్మ-దుండిగల్ మండలం, బహాదూర్‌పల్లిలోని మేకల వేంకటేశం ఫంక్షన్‌హాల్లో శనివారం ఏర్పాటు చేసిన గృహలక్ష్మి పథకం పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన 679, కొంపల్లి మున్సిపాలిటీకి చెందిన 110, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిని 10మంది లబ్దిదారులకు ఆయన గృహలక్ష్మి పథకం పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు గృహలక్ష్మి పథకం ఓ వరమని పేదల సొంతింటి కల నేరవేర్చిన మహానుభావుడు సిఎం కేసిఆర్ అన్నారు. గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. రాష్ట్ర సంపద పెంచి పేదలకు పంచడమే సిఎం లక్ష్యమని, బిఆర్ఎస్ మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో కమీషనర్ సత్యనారాయణరావు, తహాసీల్దార్ సుచరిత, కెఎంసి చైర్మన్ శ్రీశైలంయాదవ్, డిఎంసి వైస్‌చైర్మన్ పద్మారావు, డిఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవరెడ్డి, కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎలుగారి సత్యనారాయణ, సీనియర్ నాయకులు రవీందర్‌యాదవ్, నాగరాజుయాదవ్, జక్కుల శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు, లబ్దిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## షేక్‌పేట్‌లో కోటి రూపాయలతో పైప్‌లైన్ పనులు ప్రారంభం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త : షేక్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, భారత రాష్ట్ర సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ శనివారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హకీంషా కాలనీలో 18 లక్షలతో సెవరేజ్ పైప్‌లైన్, విరాట్ నగర్‌లో 6.5లక్షలతో మంచినీటి పైప్‌లైన్, డైమండ్ డీల్ కాలనీలో 25లక్షలతో, 9లక్షలతో నగర్ కాలనీలో సెవరేజ్ పైప్‌లైన్ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా షేక్‌పేట్ విలేజ్ సెవరేజ్ పైప్‌లైన్ 30 లక్షలతో, వివేకానందనగర్ కాలనీలో 16.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ కోసం మంజూరైనవి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షులు ప్రదీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి షకీల్ అహ్మద్, గౌరీ శంకర్, పజ్జాద్, అకీల్, అక్బర్ భాయ్, ఎల్లేష్, రాము, శ్రీనివాస్, రమేష్, వీరేష్, నాగరాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ పాదయాత్ర


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ శనివారం పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని నర్మదా నర్సింగ్ హోం సమీపంలో మాధవరావు లేన్ రోడ్డు నిర్మాణం పనులను పురోగతిని బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ కుమార్, జిహెచ్ఎంసి ఏఇ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి పరిశీలించారు. త్వరలోనే ఈ రోడ్డును ప్రజలకు అందుబాటోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అధికారులపై వత్తిడి తీసుకురావడం మూలంగానే త్వరితగతిన పనులకు సంబంధించి అనుమతులు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు ఆనందరావు, రెహ్మాత్ ఆలీ, సుధాకర్, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వం: సత్య శ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త : కార్మికుల జీవితాలతో అధికార ప్రభుత్వం చెలగాటమాడుతోందని టిపిసిసి అధికార ప్రతినధి డాక్టర్ సత్యంశ్రీరంగం మండిపడ్డారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ చౌరస్తా ఎమ్మార్వో ఆఫీస్ వద్ద తమ సమస్యల పరిష్కారం కోసం 13వ రోజు ఆశా వర్కర్ల ఆందోళనలో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మద్దతు తెలిపి వంటా వార్పు కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి అధికార ప్రతినిధి, పిసిసి సభ్యులు డా.సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యంశ్రీరంగం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లపై కక్ష సాధింపు ధోరణి మానుకొని వారి సమస్యలు పరిష్కరంచాలని డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశా వర్కర్లను క్రమబద్ధీకరిస్తామని వారికి 18వేల జీతాన్ని ఇస్తామని ప్రకటించారని అన్నారు. వాటిని ఇప్పటివరకు అమలు చేయకపోవడంతోనే వారు సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. మంత్రి కెటిఆర్ ఆశా వర్కర్లు వినతిపత్రం ఇస్తామన్న తీసుకునే పరిస్థితిలో లేడని అన్నారు. కరోనా సమయంలో ఆశా వర్కర్ల సేవలు మరువలేనివని అన్నారు. నిత్యం ప్రజలకు సేవలు చేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం చులకనగా చూడటం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ వీళ్ళ న్యాయమైన డిమాండ్లకు సంపూర్ణంగా మద్దతిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వీళ్ళ డిమాండ్లను సమస్యలను అన్ని తీరుస్తామని హామి ఇచ్చారు. ఆశా వర్కర్లపై కక్ష సాధింపు ధోరణి మానుకొని వెంటనే వేతనం పెంచి, సమ్మె విరమింపచేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సెక్రటరీ ఐలాపురం రాజశేకర , కుక్కల రమేష్, కృష్ణరాజ్‌పుత్, రాము, నర్సింహాయాదవ్, వినయ్ ముదిరాజ్, జ్యోతి, రమాదేవి, విజయలక్ష్మి, భారతమ్మ, రేణుక, జ్యోతి, మహేందం తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరెలు పంపిణి చేసిన కార్పొరేటర్


మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: రానున్న బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని శనివారం వార్డు కార్యాలయంలో హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్, అధికారులతో కలిసి మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. బతుకమ్మ, దసరా పండుగలను భక్తి, శ్రద్ధలతో కనుల పండువగా జరుపుకోవాలని ఆమె మహిళలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రజిత, సిబ్బంది, బిజెపి నాయలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం


డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

హైదరాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: కాచిగూడ డివిజన్‌లోని నింబోలిఅడ్డలోగల ఎకె భవన్ లైన్‌లో 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్‌కు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## 12 నుంచి టిటిడి డైరీలు, క్యాలెండర్ల విక్రయిం ప్రారంభం

సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త : తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి) ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్లు, డైరీలు-2024 విక్రయాలు ఈ నెల 12 వ తేదీ నుంచి లిబర్టి వద్దగల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో విక్రయించబడును. 12 పేజీల శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఫొటోలతో ఉన్న క్యాలెండర్ ధర 130 రూపాయలు, శ్రీవారి పెద్ద క్యాలెండర్ 20, శ్రీవారు పద్మావతిదేవి అమ్మవారు ఉన్న చిన్న క్యాలెండర్ ధర 15, టేబల్ క్యాలెండర్ 75, డైరీ పెద్దది 150 రూపాయలు, చిన్నది 120 రూపాయలకు విక్రయించబడును. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోగలరు.

## సైక్లింగ్ వ్యాయమంతో ఆరోగ్యం



విద్యార్థికి చెక్కును అందజేస్తున్న కల్నల్ సంజయ్, డా. నవ్య

నాచారం,అక్టోబర్ 7 ప్రభాతవార్త: నేడు మారుతున్న జీవన శైలికి వ్యాయమం తరువాత సైక్లింగ్ కు ఎంతో ప్రాధాన్యత కల్గిఉందని కల్నల్ సంజయ్,అంకుర ఆసుపత్రి డా.నవ్య పేర్కొన్నారు. పల్లివి ఇంటర్నేషనల్ స్కూల్ ఆద్వర్యంలో సైక్లోథాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లి,తండ్రులకు, విద్యార్థులకు 5కె.10కె సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథులుగా కల్నల్ సంజయ్, అంకుర ఆసుపత్రి ఎండి డా.నవ్య, జాతీయ బాడి బిల్డర్ వాహిద్, డైరెక్టర్ సుశీల్ కుమార్‌లు పాల్గొని పోటీలను జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైక్లింగ్, యోగా ద్వార శారీరక ఆరోగ్యం పొందవచ్చన్నారు. వ్యక్తి గత వికాసానికి ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా పోటీలల్లో పాల్గొన్న పేరెంట్స్ స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ గ్రెసిల్డా రోజ్ పలువురు విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వండి


రాంగోపాల్‌పేట జీరా ఇందిరా నగర్ బస్తీలో పాదయాత్ర చేస్తున్న డాక్టర్ కోట నీలిమ

బేగంపేట అక్టోబరు 7,ప్రభాతవార్త : తెలంగాణా రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ విజ్ఞప్తి చేసారు.తెలంగాణా రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీకి సనత్‌నగర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తప్పకుండా విజయాన్ని ఇవ్వాలని కోరారు.ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ఇచ్చిందన్నారు.శనివారం రాంగోపాల్‌పేట డివిజన్ లోని జీరా ఇందిరా నగర్ లో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తెలియజేసారు.రాష్ట్రంలో సంక్షేమ ఫలాలు అట్టడుగు స్థాయి వరకు అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఉష,సురేష్,అబ్దుల్ ఖరీం,రెహమాన్, శ్రీకాంత్‌చారి,తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగుట్ట డివిజన్‌లో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా : గణేష్ యాదవ్

అడ్డగుట్ట, అక్టోబర్ 7 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్ యాదవ్ తెలిపారు. డివిజన్ అధ్యక్షులుగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు అనీల్ కుమార్ యాదవ్ నియామకపత్రాన్ని అందజేశారు.

## సనత్‌నగర్ బిసిలకే కేటాయించాలి

### అధిష్ఠాన వర్గం ఎఐసిసి, టి-పిసిసికి విజ్ఞప్తి చేసిన స్థానిక బిసి నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న విజయవర్ధన్‌నాయుడు

సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్‌ను స్థానికులైన బిసి అభ్యర్థులకే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ బిసి నాయకులు అధిష్టాన వర్గానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ అధిష్టాన వర్గం ఎఐసిసి, టి-పిసిసి నేతలకు వినతి పత్రాలను సమర్పించామని వారు తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు కల్లూరి విజయవర్ధన్‌నాయుడు, డా.శివకుమార్, గుంటి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధిక శాతం బిసి ఓటర్లు ఉన్నారని, పార్టీ అధిష్టాన వర్గం బిసిలకే సీటు కేటాయిస్తే సునాయసంగా విజయం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఇటీవల ఓసి సామాజికి వర్గానికి చెందిన కొందరూ కోట నీలిమా, మర్రి ఆదిత్యరెడ్డి టెక్కట్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారని, వారికి టిక్కెట్ కేటాయించరాదని కోరారు. ఎఐసిసిలో పనిచేస్తున్న పవన్ కోరా తన భర్తని కోట నీలిమా తనకు టిక్కెట్ వచ్చిందని సనత్‌నగర్ నియోజవర్గంలోని ఓటర్లకు, నాయకులకు మాయ మాటలు చెపుతూ ప్రచారం చేసుకుటుంన్నారని, ఆమె మాయ మాటలను ప్రజలు, ఓటర్లు నమ్మడం లేదని వారు స్పష్టం చేశారు. గతంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డికి, ఆయన కుమారుడు మర్రి శశిధర్‌రెడ్డికి బిసిలు ఓట్లు వేసి గెలిపించారని ఇప్పుడు కొత్తగా ఆయన కోడుకు ఆదిత్యరెడ్డి కూడా పోటికి సిద్దమైనారని, ఇలా అగ్రవర్ణాలను గెలిపించుకుంటాపోతే దశాబ్దాల తరబడి కాంగ్రెస్ పార్టీలో సేవలు అందిస్తున్న బిసి పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. కోట నీలిమా, ఆదిత్యరెడ్డికి సీటు కేటాయించరాదని స్థానికులైన, బిసిలైన తమకు అధిష్టాన వర్గం సీటు కేటాయించాలని, కల్లూరి విజయవర్ధన్‌నాయుడు, గుంటి సుధీర్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

## సమస్యలు పాదయాత్ర ద్వారానే తెలుస్తాయి

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు


కరపత్రాలను అందజేస్తున్న రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 7, ప్రభాత వార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలో చేపడుతున్న పాద యాత్ర ద్వారా పలు సమస్యలు బయటపడుతున్నా యని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఫతేనగర్ డివిజన్ పరిధిలోని లైన్ రోడ్‌లోని గణేష్ దేవాలయం నుండి ఇంటింటికి బిజెపి భరోసా యాత్ర 57వ రోజు పాదయాత్రలో వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. గడపగడపకు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ (అర్బన్) బిజెపి అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్, కృష్ణాగౌడ్, హరిప్రసాద్, బానేశ్, యాదగిరి, నరేష్, చంద్రారెడ్డి, రమేష్, రేవప్ప, రవి, అస్లాం, నాగేష్, తులసి, కార్తిక్, సాయి, తేజ, ఉషారాణి, కృష్ణవేణి, సురేష్, బ్రహ్మం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు పేదలకు వరం లాంటివి

### అల్పాహార పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలన్నీ నిరుపేదలకు మేలు చేకూర్చేవేనని ఆయన ఆలోచన ముందుగా పేదల కుటుంబం నుంచి వెయదలవుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అల్పాహార పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జోనల్ కమీషనర్ మమత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవీయ కోణంలో ఆలోచించే గప్ప ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. ఇప్పటికే నిరుపేద విద్యార్థులైన పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో సన్నబియ్యం భోజనం పెట్టడమే కాకుండా నేడు అల్పాహారం అందించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఎంతోమంది నిరుపేద బిడ్డలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారని వారందరికీ నేనున్నానని భరోసా కల్పిస్తూ అండగా ఉంటున్న ముఖ్యమంత్రి లాంటి గొప్ప నాయకుడు మరెక్కడా లేరని అన్నారు. కేవలం 10 ఏళ్ళలో ప్రతి ఇంటికి సంక్షేమం అందించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులు, ఉపాధ్యాయులు, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత: రేఖ యాదగిరి

### రూ.23.42.కోట్ల పనులకు ఆమోదం తెలిపిన కౌన్సిల్ సభ్యులు


నార్సింగి మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్ రేఖ యాదగిరి, కమిషనర్ సురేందర్‌రెడ్డిలు

నార్సింగి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నామని చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి పేర్కొన్నారు. శనివారం నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశంను నిర్వహించారు. కమీషనర్ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు యాదమ్మ, విజిత ప్రశాంత్ యాదవ్, సునీత గణేష్, జి.శివారెడ్డి, పత్తి శ్రీకాంత్, అరుణజ్యోతి, విజయ్ బాబు, దుర్గేష్ యాదవ్, ఉషారాణి, ప్రవళిక కిరణ్ తదితరులతో కలిసి రేఖ యాదగిరి సమావేశంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యులందరి సూచలనలు, సలహాలు పరిగణనలోకి తీసుకొని పలు అభివృద్ధి పనులకు నిదులు ఖర్చు చేయాలని తీర్మాణం చేశామన్నారు. పార్కులు, స్మశాన వాటికలు, రోడ్ల పక్కన సుందరీకరణ పనులకు గాను రూ.13 కోట్లు, ఫుట్‌పాత్‌లు, కమ్యూనిటీహాళ్లు, మాడ్రన్ లైటింగ్, పేయింటింగ్ పనులకు గాను రూ.10.42కోట్లను కేటాయిస్తున్నామని చైర్ పర్సన్ రేఖ యాదగిరి స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన లోక్‌దళ్ పార్టీ

సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: కేంద్రంలోని బిజెపి, గతంలో దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే మాయ మాటలు చెప్పి ప్రజలను అకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు ఆరోపించారు. ఆ పార్టీ నాయకులు ఎన్ని మాయమాటలు చెప్పినా, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఓటర్లు నమ్మె స్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. శనివారం లోక్‌దళ్ పార్టీ నగర కమిటి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అకర్షితులై వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ బిఆర్ఎస్‌కు సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని చెప్పారు. రైతులకు ఉచిత విద్యుత్, రైతు బంధు, దళిత బంధు, కళ్యాణలక్ష్మి, షాది ముబారక్, మిషన్ భగీరథ, కాకతీయ తదితర ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి ప్రజలకు మేలు చేస్తున్నందుకే మద్దతు ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు రాజు, ముఖేష్, శ్యాం, గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.


హైఐసిసిలో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## బతుకమ్మ చీరెలను పంపిణి చేసిన కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్



బేగంబజార్,అక్టోబర్ 7ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు బతుకమ్మచీరెలను బేగంబజార్ కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్ అందచేశారు.బేగంబజార్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిన బతుకమ్మచీరెలను మహిళలకు అందచేశారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు, కట్ట రమేష్‌ముదిరాజ్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రామాయణ్ మేళా ఉత్సవాలు


రామాయణ్‌మేళా కమిటి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గోవింద్‌రాఠి

అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అక్టోబర్15 నుంచి అక్టోబర్ 24వ తేది వరకు రామాయణ్‌మేళా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకుగాను ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు మేళా చైర్మన్ గోవింద్‌రాఠి తెలిపారు.శనివారం మేళా ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతియేటా మాదిరిగానే ఈయేడు కూడా మేళా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో మేళా ప్రతినిధులు గిరిధర్‌లాల్‌డాగా, మనోజ్ జైస్వాల్, సుమీత్‌రాఠి,నందగోపాల్ బట్టడ్ పాల్గొన్నారు.

## ఐఏసిసి రీజనల్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్ బాడిగ

హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త: ఇండో అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ( ఐఏసిసి) ఏపీ - తెలంగాణ చాప్టర్ కొత్త ఆఫీస్ బేరర్లను ఎన్నుకుంది. శనివారం నగరంలో జరిగిన ఎన్నికల్లో ఐఏసిసి సదరన్ రీజినల్ ప్రెసిడెంట్‌గా ఫీనిక్స్ డైరెక్టర్ శ్రీకాంత్ బాడిగ అన్నికయ్యారు. రహేజ ఐటి పార్కు సిఎఫ్ఓ కె.గనేష్ సుబుధిని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే అవినాష్ చుక్కపల్లి , శ్రీదేవి దేవిరెడ్డిలు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కాగా కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు శ్రీకాంత్ బాడిగ వివిధ కేంద్రప్రభుత్వ, అంతర్జాతీయ ప్యానల్స్‌లో పనిచేశాడు. అలాగే కేంద్ర పరిశ్రమల మంత్రిత్వశాఖ బోర్డు ఆఫ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. కాగా ఐఏసిసి అనేది 1968లో స్థాపించబడింది. ఇది భారతదేశం-యుఎస్ ఎకనామిక్ ఎంగేజ్‌మెంట్‌ను సమన్వయం చేసేందుకు కృషి చేస్తుంది. ఇందలో దాదాపు 1500మంది సభ్యులు ఉన్నారు.

## అక్బర్ ఆలీఖాన్ కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ


ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో అక్బర్ ఆలీఖాన్ పార్థివ దేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి తలసాని

బేగంపేట అక్టోబరు 7,ప్రభాతవార్త : బేగంపేట టీఆర్ఎస్ సీనియర్ నాయకులు సలీంఖాన్ సోదరుడు అక్బర్ ఆలీఖాన్ పార్థివ దేహాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సలీంఖాన్ కు ధైర్యం చెప్పారు.అక్బర్ ఆలీఖాన్ కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అక్బర్ ఆలీఖాన్ పార్థివ దేహం వద్ద మంత్రి నివాళులు అర్పించారు.తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.మంత్రి వెంట కార్పోరేటర్ మహేశ్వరి శ్రీహరి,బీఆర్ఎస్ నాయకులు డి.వి.నరేందర్‌రావు నాయి.టి.శ్రీహరి,శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ ముదిరాజ్,అక్బర్,ఆరిఫ్,ఖలీల్,ఫాజల్ ఉన్నారు.


నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటి మీనాక్షి చౌదరి

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, అక్టోబరు 7 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం డా.పేరిందేవి శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భగా వినాయక కౌతం, జతిస్వరం, మూషికవాహన, అయిగిరి నందిని, తాండవ నృత్యకారి, అఖిలాండేశ్వరి, శ్రీ విఘ్నరాజం, భజే వన్దే వసుదేవం, గణనాయక, జనుతశబ్దం, అదిగో, అల్లదిగో తదితర అంశాలను కళాకారులు భావన, శ్వేత, అభిజ్ఞ, కృతిక, రోషిత, తన్మయి, భవ్య తదితరులు ప్రదర్శించారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## రూ.2 కోట్ల37లక్షలతో అభివృద్ది పనులు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ గీత తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 7 ప్రభాతవార్త :** చిలుకానగర్‌డివిజన్‌లో రూ.2కోట్ల 37లక్షల వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధిపనులను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్‌కాలనీలో రూ.21లక్షలతో రిటైనింగ్ వాల్, మహిళా భవన్ మరమ్మతులకు రూ.19లక్షలు, బాలాజీ ఎన్‌క్లేవ్‌లో సిసి రోడ్డుకు రూ.19లక్షలు, కల్యాణపురిలో సిసి రోడ్డుకు రూ.80లక్షలు, బీరప్పగడ్డలో రూ.37లక్షలు, చిలుకానగర్, న్యూరాంనగర్‌లో రూ.19లక్షలు, నార్త్ కల్యాణపురిలో రూ.19లక్షలతో పార్కు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. పనుల విషయంలో నాణ్యత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసి శ్రీనివాసు, ఇంజనీర్ ఎల్.నాగేందర్, డిఇ నిఖిల్‌రెడ్డి, ఎఇ రాజ్‌కుమార్, పలువురు బిఆర్ఎస్ నేతలు, కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## డి.కె.అరుణ సమక్షంలో బిజెపిలో చేరిన చీకోటి



బిజెపిలో చేరుతున్న చీకోటి ప్రవీణ్

**సైదాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** క్యాసినోతో ప్రముఖంగా వార్తల్లో నిలిచిన ధర్మరక్ష సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చీకోటి ప్రవీణ్ శనివారం బిజెపిలో చేరారు. కొద్ది రోజులక్రితం చీకోటి ప్రవీణ్ బిజెపిలో చేరడానికి సిద్ధమైనప్పటికీ చివరి నిమిషంలో కొన్ని కారణాల వల్ల చేరిక వాయిదా పడింది. పార్టీలోని కొంతమంది నాయకులు చీకోటి చేరికను వ్యతిరేకించడంతో ఆయన చేరిక అప్పట్లో వాయిదా పడింది. కాగా శనివార ం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో డికె అరుణ, ఇతర నాయకుల సమక్షంలో ఆయన బిజెపిలో చేరారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో భారీ చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం కార్యకర్తలతో మైనంపల్లి హన్మంత్‌రావు

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేసి, కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తానని మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. శనివారం పలువురు బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థాన్ని పుచ్చుకోవడం జరిగిందన్నారు. అనంతరం వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని టెలికం కాలనీలోని కాంగ్రెస్ నాయకులతో చర్చించి కాంగ్రెస్ పార్టీ విజయానికి దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చాకో, జీవకన్, రహీమ్ బాయ్, ఆశ, కుట్టి శ్రీను, జాన్, మోమిన్ పాషా, ఈ కార్యక్రమంలో జి.ఎన్.వి సతీష్ కుమార్, పిట్ల శ్రీనివాస్, ఎస్సార్ ప్రసాద్, బాలరాజు, సయ్య మబ్బు, ఆగమయ్య, బాలరాజు, సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## హోంగార్డు నుండి సివిల్ పోలీస్‌గా పదోన్నతి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** చైతన్యపురి పోలీస్‌స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న గణేశ్‌కి సివిల్ పోలీసు కానిస్టేబుల్ విభాగంలో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగం సంపాదించడంతో హోంగార్డు గణేష్ ని చైతన్యపురి ఇన్స్పెక్టర్ బోయ నాగార్జున, డిఐ నాగరాజుగౌడ్, ఎస్సై రవి, పోలీస్ సిబ్బంది శనివారం సత్కరించారు. హోంగార్డు నిర్వహణలో తూచి తప్పకుండా విధులు నిర్వహిస్తూ కూడా పోలీస్ కానిస్టేబుల్ విభాగంలో సివిల్ ఉద్యోగం సాధించడం పట్ల ఇన్స్పెక్టర్లు అభినందించారు. ఉద్యోగ బాధ్యతలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

## డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా గిరిధర్‌రెడ్డి



గిరిధర్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా గంగిరెడ్డి గిరిధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో బిజెపిని మరింత బలోపేతం చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కన్వీనర్ ధీరజ్‌లాల్, కార్యదర్శులు శ్రీనాథ్, మహేష్, అధికార ప్రతినిధి వీరేంద్రబాబు, మహిళా మోర్చా అధ్యక్షురాలు దశరథలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి కెసిఆర్ ధ్యేయం : విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న సబితాఇంద్రారెడ్డి, రాధాధీరజ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సిఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, బతుకమ్మ చీరలను ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డితో కలిసి శనివారం సరూర్‌నగర్ మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో మంత్రి సబిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో అనేక ప్రజాసంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 1400మంది లబ్ధిదారులకు డబల్ బెడ్‌రూమ్ ఇచ్చామని తెలిపారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించడానికి ముఖ్యమంత్రి మానవియత కోణంలో ఆలోచించి అల్పాహారం పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఇంట్లోనే ప్రతిఒక్కరికి ఏదో రకమైన లబ్ధి చేకూరే విధంగా ముఖ్యమంత్రి ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని సూచించారు. నూతనంగా అమలైన అల్పాహారం అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుట్ల అరవింద్‌శర్మ, మాజీ కార్పొరేటర్ అనిత దయాకర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధ పడుతున్న కుటుంబానికి ఆర్థిక సహాయం : కార్పోరేటర్ శాంతిశేఖర్



ఆర్థిక సహాయం అందజేస్తున్న కార్పోరేటర్ శాంతి శేఖర్

**నాచారం, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి శనివారం నాచారం కార్పోరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ ఆర్థిక సహాయం అందజేసి వారికి బరోసా నిచ్చారు. కారు డ్రైవింగ్ చేస్తూ వెన్నపూస సమస్యతో ఇంట్లోనే మంచాన పడ్డ రామును కార్పోరేటర్, శాంతి సాయిజన్ శేఖర్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స నిమిత్తం నీమ్స్ వైద్యులతో మాట్లాడి చికిత్స చేయించేందుకు కృషి చేస్తానని వారికి ధైర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో చామచందర్, శివకుమార్, మహేష్, శంకర్, శివ, దత్తు, బొడ్డు శివ, అంజన్న, కుమార్, చింటూ, అనిల్, సాయన్న, యూసుఫ్ తధితరులు పాల్గొన్నారు.

## అధిక నిధులతో మల్లాపూర్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ పన్నాల

**నాచారం, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** అధిక నిధులతో మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కెఎల్‌రెడ్డినగర్ కాలనీలో రూ. 34 లక్షల ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటు చేసిన సీసీరోడ్డు పనులకు కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుమన్‌గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరికలు

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పేద, మధ్య తరగతి ప్రజలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందారని మల్కాజిగిరి పార్లమెంటరీ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని నేరెడ్‌మెట్ మధురానగర్‌లో యువ నాయకులు సుమన్ గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 150మంది బిఆర్ఎస్‌లో చేరడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఎన్నో వినూత్నమైన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం కేవలం బి.ఆర్.ఎస్ పార్టీతోనే సాధ్యమన్నారు. నిరుపేద ప్రజలకు ఎన్నో రకాలు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నేరెడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి: అరుణ

**సైదాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని ఏకలవ్యబస్తీలో చేపడుతున్న సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు. బస్తీలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రమన్‌సింగ్, మనోజ్, పంకజ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరలు పంపిణీ : కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సరస్వతినగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో శనివారం కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి బతుకమ్మ చీరల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అర్హులైన మహిళలందరికి చీరలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాస ్కర్‌రెడ్డి, చెన్నారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు నెలలుగా ప్రజల అవస్థ

### ఓ పక్క ప్రభుత్వాసుపత్రి - మరో పక్క రేషన్ షాప్

### రాకపోకలకు తీవ్ర అంతరాయం

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** రోడ్డు నిర్మాణంకోసం తవ్వి వదిలి వేయడంతో ప్రజలు తీవ్ర అవస్థకు గురవుతున్నారు. రెండు నెలల క్రితం రోడ్డు నిర్మిస్తామని ఉన్న రోడ్డును అధికారులు ఇదిగో అదిగో అంటూ దాటవేసే ప్రయత్నం ప్రజలకు శాపంగా మారింది. కొత్తపేట గ్రామంలో రెండు నెలలుగా స్థానిక ప్రజలు రోడ్డు లేక నరకయాతన అనుభవిస్తున్నారు. తొవ్విన రోడ్డు దారిలో ప్రభుత్వ ఆసుపత్రి (బస్తి దవాఖాన), మరో పక్కన రేషన్ దుకాణం ఉంది. వైరల్ కారణంగా పలు వ్యాధులు ప్రబలి ప్రతిరోజు వందలాదిమంది చికిత్స నిమిత్తం బస్తీ దవాఖానకు వస్తున్నారు. వచ్చే రోగులకు రోడ్డు లేక పోవడంతో నానా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదేవిధంగా నిత్యవసర సరుకులకోసం రేషన్ దుకాణం కోసం వచ్చే వారి పరిస్థితి కూడా దయనీయంగా మారింది. బియ్యము ఇతర నిత్యవసర వస్తువులు రేషన్ దుకాణం నుంచి తీసుకు వెళ్లేందుకు ప్రజలు నానా ఇక్కట్లకు గురికావాల్సి వస్తుంది. రోడ్డు నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలని స్థానికులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన ఏదో ఒక వంక చెబుతూ దాటేసే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్తీ దవాఖానకు, రేషన్ దుకాణం వద్దకు వచ్చే వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## శివారు కాలనీల అభివృద్ధే లక్ష్యం : దేవిరెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, అక్టోబరు 7 ప్రభాతవార్త:** శివారు కాలనీలలో మౌలిక వసతులు కల్పించి, ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో రూ. 9 కోట్ల 21 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. గాయత్రీనగర్, ఫేజ్2,4, బృందావన్ మిడోస్‌కాలనీ, సిద్ధి వినాయక హిల్స్ కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, గౌతమీనగర్ లలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసారు. గాంధీనగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, దుర్గాసాయినగర్, ఎస్‌కెడినగర్‌లలో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, మిగిలిన పనులను దశలవారిగా పూర్తి చేస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికలలో అభివృద్ధి కోరుకునే నాయకుడికి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు అనిల్‌చౌదని, సామ బుచ్చిరెడ్డి, కొత్త శ్రీధర్‌గౌడ్, గంగం శివశంకర్, గడ్డం మల్లేష్‌గౌడ్, పోగుల రాంబాబు, గంగం ప్రేమ్‌నాథ్, బాకారం నర్సింహారెడ్డి, వివిధ కాలనీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందిస్తా : చైర్‌పర్సన్ అనురాధరాంరెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ అనురాధ తదితరులు

**తుర్కయంజాల్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి అన్నారు. వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించామని, పనులు శరవేగంగా సాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. సూరజ్‌నగర్‌లో రూ.20లక్షలతో సీసీ రోడ్లు, పాటిగూడలో రూ.14లక్షలతో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ కుంట ఉదయశ్రీగోపాల్‌రెడ్డితో కలిసి చైర్‌పర్సన్ ప్రారంభించారు. అదేవిధంగా శ్రీరాంనగర్ పేస్ 2, లక్ష్మీ నగర్ కాలనీ, సూర్య సాయి నగర్ కాలనీలో సుమారు 80 లక్షల రూపాయలతో సిసి రోడ్డు పనులను కౌన్సిలర్ కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుర్కయంజాల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, అన్ని వార్డులు, నూతన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తకుర్మా శివకుమార్, శ్రీనివాస్ గౌడ్, గోవర్దన్, గుండా నరసింహ, నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రావు, అశోక్ గౌడ్, చెన్నయ్య, గిరి, రమేష్, కుమార్, పలు కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి : కౌన్సిలర్ విద్యావతి



కాలనీవాసులకు మొక్కలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ విద్యావతి తదితరులు

**హయత్‌నగర్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** కాలుష్య నివారణకు, జీవవాయువు కోసం ప్రతిఒక్కరు మొక్కలను నాటాలని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజేందర్‌రెడ్డి అన్నారు. హరితహారంలో భాగంగా వార్డుపరిధిలోని వెంకటేశ్వర కాలనీలో శనివారం ఆమె స్థానిక కాలనీ వాసులతో కలిసి మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రతిఒక్కరు మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలని సూచించారు. అనంతరం కాలనీవాసులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రతినిధులు నారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, అక్టోబరు 7 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని బాలదానమ్మ బస్తీలో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. అదేవిధంగా రామాలయం నుండి అరోరా కాలేజ్ వరకు నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, వీరేశం, హరీష్, యాదగిరి, సంతోష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలి




విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సుభాష్‌గౌడ్ తదితరులు

**మలక్‌పేట, అక్టోబరు 7 ప్రభాతవార్త:** విద్యార్థులు భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని మలక్‌పేటలోని శ్రీ వాణి డిగ్రీ ఉమెన్స్ కాలేజ్ కరస్పాండెంట్ సుభాష్‌గౌడ్ పేర్కొన్నారు. మలక్‌పేట సిమ్లా గార్డెన్స్ లో జరిగిన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని ఆకాంక్ష వ్యక్తం చేసారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపల్ విమలారెడ్డి, అధ్యాపకులు అనుప్రియ, దామిని, జాన్, గిరిధర్, రాములు, కార్తీక్, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## గన్‌మెన్లు నా కుమారుడి లాంటివారు పోలీసులు నా కుటుంబ సభ్యులు : హోంమంత్రి మహమూద్ అలీ



రైతు విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న మహమూద్ అలీ తదితరులు

**మలక్‌పేట, అక్టోబరు 7 ప్రభాతవార్త:** గన్‌మెన్లు నా కుమారుడి లాంటివారు, పోలీసులు నా కుటుంబ సభ్యులు అని అలాంటి వారిపై నేను చేయి చేసుకోవడమేమిటని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ విచారణతో బాధపడ్డారు. శనివారం మలక్‌పేట నగరవ్యవసాయ మార్కెట్‌లో రూ. 50 లక్షలతో నిర్మించిన రైత విశ్రాంతి భవనం, ఆనియన్ షెడ్డులను ఛైర్‌పర్సన్ అనితానాయక్, వైస్ ఛైర్మన్ భూమేష్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం జరిగిన మంత్రి తలసాని పుట్టిన రోజు సందర్భంగా శాలువా, పూలబోకే తీసుకురమ్మనే క్రమంలో చేయి తగిలిందే తప్ప నా గన్‌మెన్లను కొట్టలేదని, నేను చిన్న ప్రాణికి హాని తలపెట్టనన్నారు. ఒకవేళ చేయి తగిలినట్లు ఉంటే తనను క్షమించాలని పేర్కొన్నారు.

**రైతు సంక్షేమమే ధ్యేయం :** రైతుల సంక్షేమంకోసం సిఎం కెసిఆర్ అహర్నిశలూ కృషి చేస్తున్నారని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. మలక్‌పేట మార్కెట్‌లో రైతులకు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రైతుల అభ్యున్నతికోసం పాటుపడుతున్న ఛైర్‌పర్సన్ అనితా నాయక్, వైస్ ఛైర్మన్ భూమేష్, పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎస్ దామోదర్, కార్యదర్శి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు లలిత, రాముయాదవ్, నరేష్, బట్కిరి విద్యానంద్, యాదగిరి, సల్మాన్‌ఖాన్, ఎజాస్, మాణిక్‌రావు, దేవర రాజేశ్వర్, చేగూరి వెంకటరమణ, అనిల్, వెంకటేష్, నాయకులు తీగల అజిత్‌రెడ్డి, రామేష్, హయత్ హుస్సేన్ హబీబ్, పగిళ్ల నర్సింగ్, లలిత, జగన్, మహేష్‌కుమార్, వంజరి ప్రవీణ్‌కుమార్, రాధ తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ్‌నగర్ డివిజన్ అభివృద్ధే తన లక్ష్యం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునిత తదితరులు

**మల్కాజిగిరి, అక్టోబరు 7 ప్రభాతవార్త:** గౌతమ్‌నగర్ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని గౌతమ్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. డిసెంబర్ పరిధిలోని మిర్జాలగూడలో 51 లక్షల రూపాయల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మరియు భవని నగర్ లో 11 లక్షల రూపాయల తో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పన కు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేకల రాముయాదవ్, డిఈ. లౌక్య, ఏఈ. దివ్య జ్యోతి, వర్క్ ఇన్స్పెక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మీడియా కమిటీ చైర్మన్‌గా రాజుగుప్త

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య మహాసభ మీడియా కమిటీ చైర్మన్‌గా శ్రీకాకొల్ల రాజుగుప్త నియామకం అయ్యారు. ఈ మేరకు శనివారం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో రంగారెడ్డిజిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్తా, సరూర్‌నగర్ మండల అధ్యక్షుడు పద్మా రాముగుప్త నియామక పత్రాన్ని రాజుగుప్తకు అందజేశారు. ఈ సందర్భంగా రాజుగుప్త మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తామన్నారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

## సాయిరాంకాలనీలో ఒపెన్ జిమ్ ఏర్పాటు : ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ రజితారెడ్డి

**ఉప్పల్, అక్టోబరు 7 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ సాయిరాంనగర్ కాలనీలో రూ.18లక్షలవ్యయంతో నిర్మించిన ఒపెన్ జిమ్‌ను శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ మందముల్ల రజితరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రజలు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు తుమ్మల రాజేందర్‌రెడ్డి, తుమ్మల దేవిరెడ్డి, వర్కల మధన్‌గౌడ్, బుచ్చిరెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, కట్ట రాజేందర్, సునీత, వెంకటేశ్వర్‌రావు, భాస్కర్‌రెడ్డి, రమాదేవి, భూపాల్‌రెడ్డి, అండాలు, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తికి బిఎల్ఆర్ ట్రస్ట్ చేయూత



ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి చేయూత అందిస్తున్న ఆకుల మహేందర్

**ఉప్పల్, అక్టోబరు 7 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ చర్చికాలనీలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక వ్యక్తికి బిఎల్ఆర్ ట్రస్ట్ సభ్యులు చేయూత అందించారు. రామంతాపూర్ చర్చికాలనీలో నివసించే పి. జ్యోతి భర్త రాయప్ప రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో విషయం తెలుసుకున్న బిఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకుని రావడంతో ఆయన స్పందించి రూ.పది వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా శనివారం ట్రస్ట్ ప్రతినిధులు ఆకుల మహేందర్, మధుకర్‌రెడ్డి, చిన్నారావు, నాగేశ్వర్‌రావు, పద్మ తదితరులు రాయప్ప కుటుంబ సభ్యులకు చేయూత అందించారు. పేదల కోసం పాటుపడే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్‌నాయక్‌పై దాడిని ఖండించిన గిరిజన నాయకులు

**తుర్కయంజాల్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రమావత్ కల్యాణ్‌నాయక్‌పై దాడిని గిరిజన నాయకులు ఖండించారు. కల్యాణ్‌నాయక్‌పై తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ దాడి చేశారంటూ అంబేద్కర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. చైర్పర్సన్, వైస్ చైర్ పర్సన్, దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కల్యాణ్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకవర్గం కమీషన్ల కోసమే పనిచేస్తోందని మండిపడ్డారు. గిరిజన కౌన్సిలర్ అయిన తన వార్డుకు వచ్చి దాడి చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. మరోసారి దాడులకు దిగితే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఖబద్దార్ అని హెచ్చరించారు.